సాక్షి
అనంతపురం

శుక్రవారం । 24 । మార్చి । 2023




టన్ను చీనీ రూ.30 వేలు

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు పలికాయి.



కిలో టమాట రూ.20

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, సరాసరిన రూ.7 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్	సెహరి
6.32	5.04

న్యూస్‌రీల్

ఆతిథ్యం అదిరిపోవాలి



మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: హైకోర్టు జడ్జిలకు మనమిచ్చే ఆతిథ్యం అదిరిపోవాలని డీఈఓ సాయిరామ్ అన్నారు. గురువారం అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గుత్తి డీవైఈఓ శంకర ప్రసాద్, రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎంఈఓలు, హెచ్ఎం, సమగ్ర శిక్ష ఏఎంఓ, జీసీడీఓ, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ఈనెల 25న జడ్జిలు రాయదుర్గం పర్యటనకు వస్తున్నారన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో అక్కడి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసే కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. జడ్జిలకు పూర్ణకుంభ స్వాగతం పలకాల్సి ఉంటుందన్నారు. మన ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యాశాఖ ఏర్పాటు చేసే స్టాల్‌లో అన్ని కార్యక్రమాల గురించి వివరంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

ఏపీఐఐసీ ఎస్‌డీసీగా వరప్రసాద్‌రావు

- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎంగా ఆనంద్



వరప్రసాద్‌రావు

అనంతపురం అర్బన్: ఏపీఐఐసీ ఎస్‌డీసీ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్)గా జె. వరప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్‌గా హెచ్. ఆనంద్ నియమితులయ్యారు. రాష్ట్రంలో 21 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్ ఇస్తూ జీఓ 565ను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. వరప్రసాద్ గతంలో ధర్మవరం ఆర్‌డీఓగా పని చేశారు. ఆనంద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎంగా ఉంటూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. సెలవు ముగియడంతో ఆయనను తిరిగి అదే పోస్టులో నియమించారు.

టూవీలర్ మెకానిజంలో శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు టూవీలర్ (బైక్ రిపేరీ) కోర్సులో నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 45 రోజుల పాటు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో టూవీలర్ మెకానిజంలో శిక్షణ ఇవ్వడంతో పాటు కస్టమర్లతో వ్యవహరించే తీరు, ఇంగ్లిష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంలోనూ తీర్చిదిద్దుతామన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఈ నెల 6వ తేదీ నూతన బ్యాచ్ ప్రారంభిస్తున్నామన్నారు. అభ్యర్థులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి టూల్‌కిట్, సర్టిఫికెట్ అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు 9390505952, 7780752418 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 721 మంది గైర్హాజరు

రాప్తాడురూరల్: ఇంటర్మీడియల్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన మొదటి సంవత్సరం గణితం 1బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 721 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 22,930 మందికి గాను 22,390 మంది, ఒకేషనల్ విద్యార్థులు 3,127 మందికి గాను 2,946 మంది హాజరయ్యారు. అధికారులు వివిధ కేంద్రాలను పరిశీలించారు.

ఒకే రోజు రూ.1.05 కోట్ల పన్ను వసూలు



ఆర్‌ఓకు చెక్కు అందిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: ఇంటి, నీటి పన్ను ఒకే రోజు రూ.1.05 కోట్లు వసూలైంది. గురువారం ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు మురళీ, వేణు, బాబు, పద్మావతి, సచివాలయ సిబ్బంది నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నామా టవర్స్ నిర్వాహకులు అత్యధికంగా రూ.27,50,046 పన్ను చెల్లించారు. పెండింగ్ ఉన్న వారు ఒకేసారి పన్ను చెల్లించగా రూ.12.51 లక్షల వడ్డీ మాఫీ అయ్యింది. ఓ బ్యాంకు నిర్వాహకులు అత్యధికంగా రూ.5,40,000 చెల్లించారు.

పవనపుత్రా.. పాహిమాం




సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి

వేలాదిమంది భక్తుల నడుమ సాగుతున్న రథోత్సవం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురంలో నెట్టికంటి ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం కనులపండువగా సాగింది. వేలాదిమంది భక్తులతో ఆలయ పురవీధులు పోటెత్తాయి. 'ఆంజనేయ రక్షమాం.. పవన పుత్ర పాహిమాం' అంటూ భక్తులు స్వామివారి సేవలో తరించిపోయారు. గురువారం వేకువజామునే నెట్టికంటి ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించిన అర్చక బృందం స్వామిని ప్రత్యేక పుష్పాలతో అందంగా తీర్చిదిద్ది దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రధాన గోపురం ముందు రథం నిలిపి హోమం, బలిహరణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి వార్లను రథంలో కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ ఈఓ వెంకటేశ్వరరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ కొబ్బరికాయ సమర్పించి రథోత్సవం ప్రారంభించారు. ఉత్సవంలో అడుగడుగునా భక్తులు స్వామివారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, పాలకమండలి మాజీ సభ్యులు త్యాగరాజు, గంతుల రామాంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ మాసం



విద్యుద్దీపాలంకరణలో సప్తగిరి సర్కిల్‌లోని మసీదు, ఆకాశంలో నెలవంక

అనంతపురం సప్తగిరి సర్కిల్/రాయదుర్గం టౌన్: ముస్లింల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. గురువారం రాత్రి నెలవంక కనిపించడంతో ముస్లింలు ఉపవాసదీక్షలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లాలో మసీదులు విద్యుద్దీపాలంకరణలతో పండుగ శోభ సంతరించుకున్నాయి. రంజాన్ మాసం మొత్తం ముస్లింలు దానధర్మాలు, ప్రత్యేక ప్రార్థనలతో అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో ఐదు సూత్రాలు పాటించాల్సి ఉంటుంది. వాటిలో మొదటిది. కల్మా:(లా ఇలాహ ఇల్లల్లాహ్ మొహమ్మదర్రసూలుల్లాహ్ అల్లాహ్ గొప్పవాడు ఆయన ఒక్కడే ఆరాధ్యానికి అర్హుడు అని దీని అర్థం). 2.నమాజు చదవడం, ప్రతి ముస్లిం రోజుకు ఐదుసార్లు ఆచరించాల్సి ఉంటుంది. 3. రోజా.. మాసం మొత్తం ఉపవాసాలు ఉండి అల్లాహ్‌ను స్మరించాలి. 4. జకాత్.. ఆదాయంలో 0.25 భాగాన్ని పేదలకు పంచాలి. చిట్టచివరిది హజ్. స్తోమత కలిగిన ప్రతి ముస్లిం తప్పనిసరిగా హజ్ పాటించాలి.

నెలవంక చూసి.. : ముస్లింలు నెలవంకను చూసి ఉపవాసాలు ప్రారంభిస్తారు. 30 రోజుల పాటు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పాటించి కఠోర దీక్షతో అల్లాహ్‌ను స్మరించుకుంటారు. తరువాతి మాసం షవ్వాల్‌లో నెలవంకను చూసి ఉపవాసాలు విరమిస్తారు. షవ్వాల్ తొలి రోజును రంజాన్‌గా పాటిస్తారు.

ముక్క నమిలేస్తున్నారు..

- మటన్ వైపే జనం మొగ్గు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన మేక, గొర్రె మాంసం ఉత్పత్తి
- చిత్తూరు మినహా రాయలసీమలో అత్యధికంగా ఇక్కడే వినియోగం
- నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం
- వినియోగం మరింత పెరిగే అవకాశం

ఉమ్మడి అనంత జిల్లాలో మటన్ ఉత్పత్తి ఏటేటా పెరుగుతోంది. చిత్తూరు మినహా రాయలసీమలోనే అత్యధికంగా మన జిల్లాల్లోనే మటన్ వినియోగం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ధర చుక్కలనంటుతున్నా ప్రజలు చికెన్ కంటే మటన్ వైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. రంజాన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది.



అనంతపురం నగరంలో ఓ షాపు వద్ద మటన్ కొనుగోలు చేస్తున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మేకలు, గొర్రెల మాంసం (మటన్) ఉత్పత్తిలో ఇటు అనంతపురం, అటు శ్రీ సత్యసాయి జిల్లాలు పోటాపోటీగా ఉన్నాయి. వినియోగంలోనూ ఉభయ జిల్లాలవాసులు పోటీ పడుతున్నారు. చాలాకాలం నుంచే రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురం జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకం ఉంది. ఈ క్రమంలోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉమ్మడి జిల్లాలో 55 మెట్రిక్ టన్నులకు పైగా మటన్ ఉత్పత్తి జరిగినట్లు ఒక పరిశీలనలో తేలింది.

చికెన్ కంటే మటన్ ప్రియులే ఎక్కువ

చికెన్ కంటే మటన్‌తో భోజనం చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. మటన్ రేటు కిలో రూ. 800 చేరుకున్నా జనం దానివైపే మొగ్గుచూపుతున్నారు. వందలో 50 శాతం మంది నెలలో రెండుసార్లు మటన్ తింటున్నట్లు తేలింది. పల్లెటూళ్లలోనూ మటన్ వినియోగం తక్కువేమీ కాదు. జాతరలు, తిరునాళ్ల సందర్భంలో మిత్రులు, బంధువులతో కలిసి మటన్ ముక్క నమిలేస్తున్నారు.

రంజాన్‌లో మరింత ఎక్కువ..

రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. రెండు జిల్లాల్లోనూ ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. రంజాన్ మాసంలో తయారయ్యే హలీం ముస్లింలకే కాకుండా మిగతా వర్గాల వారికి కూడా బాగా నచ్చుతుంది. దీంతో గొర్రెలు, పొట్టేళ్ల మాంసం వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉంది. అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ మటన్ హలీం ప్రత్యేక ఆకర్షణ అవుతుంది.

బెంగళూరుకు ఎగుమతి..

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరుకు ఎక్కువగా మటన్ ఎగుమతి అవుతోంది. రోజూ లారీల కొద్దీ గొర్రెలు, మేకలు అక్కడికి వెళుతున్నాయి. దీంతో పాటు ఇక్కడ నుంచి భారీగా కోడిగుడ్లు కర్ణాటక రాజధాని వెళ్తున్నాయి. ఇక.. రెండు జిల్లాల్లోనూ గుడ్ల వినియోగం కూడా బాగా పెరిగినట్టు తేలింది. పాల ఉత్పత్తి గతంలో గరిష్టంగా 250 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ఉండేది కాదు. శ్రీ సత్యసాయిలో ఈ ఏడాది ఏకంగా 404 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరగడం గమనార్హం.

జిల్లాలో గతేడాది పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి ఇలా

కేటగిరీ	పరిమాణం
పాలు	305.52 మెట్రిక్ టన్నులు
మటన్	33.423 మెట్రిక్ టన్నులు
గుడ్లు	731.71 లక్షలు

రాయలసీమ జిల్లాల్లో మటన్ ఉత్పత్తి ఇలా

జిల్లా	మెట్రిక్ టన్నుల్లో..
కర్నూలు	27.72
నంద్యాల	28.93
అనంతపురం	33.42
శ్రీ సత్యసాయి	36.78
వైఎస్సార్	22.34
అన్నమయ్య	29.37
చిత్తూరు	42.00
తిరుపతి	26.31

నేడు వ్యవసాయ సలహా మండలి సమావేశం

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ సలహా మండలి జిల్లా స్థాయి సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు డీఏఓ చంద్రానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రిబోర్డు చైర్మన్, కలెక్టర్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, బోర్డు సభ్యులైన రైతులు హాజరవుతారని తెలిపారు. రబీ స్థితిగతులు, ఖరీఫ్‌కు సన్నాహకం, పంట మార్పిడి తదితర అంశాలపై చర్చ ఉంటుందని వెల్లడించారు.

రైతు సాధికార సంస్థ వీసీ విజయకుమార్ రాక రేపు

అనంతపురం అర్బన్: ఏపీ రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ (వీసీ) టి.విజయకుమార్ ఈనెల 25న అనంతపురం విచ్చేయనున్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. 26వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానికంగా నిర్వహించనున్న మోడల్ మేకర్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు.

42 ఏళ్ల వారూ అర్హులే

- లోక్ అదాలత్‌లో అటెండర్ పోస్టు భర్తీ నోటిఫికేషన్‌లో సవరణ

అనంతపురం: శాశ్వత లోక్ అదాలత్‌లో కాంట్రాక్టు అటెండర్ (ఓసీ) పోస్టు భర్తీకి గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ సవరించారు. ఈ మేరకు అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వయోపరిమితి 18 నుంచి 32 సంవత్సరాలుండగా తాజాగా 42 సంవత్సరాల వరకూ నిర్దేశించారు. అర్హులైన వారు ఏప్రిల్ 24 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.వివరాలు district.ecourts.gov.in/anantapur వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అనంతకు అగ్రాసనం!

- రాయితీ విత్తుకు జగన్ సర్కారు గ్రీన్‌సిగ్నల్
- 2.28 లక్షల క్వింటాళ్ల పంపిణీకి ప్రణాళిక
- అత్యధికంగా 'అనంత'కు 1,17,059 క్వింటాళ్లు



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. మే నుంచి ప్రారంభం కానున్న వ్యవసాయ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీతో ఇవ్వడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2023-24 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలో 2,28,289 క్వింటాళ్లు పంపిణీ చేయనుండగా, ప్రధానపంట వేరుశగన జిల్లాకు 85,044 క్వింటాళ్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు 1,09,131 క్వింటాళ్లు కేటాయించారు. 2023 సంవత్సరాన్ని 'ఇంటర్నేషనల్ మిల్లెట్స్ (చిరుధాన్యాలు) ఇయర్'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో చాలా దేశాల్లో కనుమరుగవుతున్న సంప్రదాయ పంటల సాగుకు చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విత్తన వేరుశనగ, పప్పుశనగతో పాటు ఈ సారి కొన్ని రకాల చిరుధాన్యపు పంటలను ప్రోత్సహించేలా పంపిణీ జాబితాలో చేర్చారు.

నాణ్యమైన విత్తనాలే పంపిణీ...

ఏపీ సీడ్స్, మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయీస్ లాంటి ప్రభుత్వ రంగ నోడల్ ఏజెన్సీల సహకారంతో సకాలంలో నాణ్యమైన విత్తనాలు తెప్పించి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు కలిపి మొత్తంగా 9,14,965 క్వింటాళ్లు రాయితీ విత్తనం కేటాయించగా, అందులో అత్యధికంగా మొదటి స్థానంలో అనంతపురం 1,17,059 క్వింటాళ్లు, రెండో స్థానంలో శ్రీ సత్యసాయి జిల్లా 1,11,230 క్వింటాళ్లకు అనుమతిచ్చారు. లక్షకు పైగా ఉన్నవి ఈ రెండు జిల్లాలే కావడం విశేషం. 62 వేల క్వింటాళ్లతో మూడో స్థానంలో వైఎస్సార్ జిల్లా ఉండగా, 61 వేల క్వింటాళ్లతో విజయనగరం, 55 వేల క్వింటాళ్లతో శ్రీకాకుళం, 52 వేల క్వింటాళ్లతో అన్నమయ్య జిల్లా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు వైఎస్ జగన్ సర్కారు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం. చిరుధాన్యాల పంటల సాగు విస్తరించే క్రమంలో రాగి, కొర్ర, జొన్న, మొక్కజొన్న లాంటి విత్తనాల కేటాయింపు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని డీఏఓ బి.చంద్రానాయక్ తెలిపారు.

2023-24 విత్తన ప్రణాళిక ఇలా..

విత్తన రకం	క్వింటాళ్లలో..
విత్తన వేరుశనగ	85,044
పప్పుశనగ	24,700
వరి	1,500
కంది	4,300
రాగి	04
కొర్ర	58
మినుము	54
పెసర	172
ఉలవ	1,025
జీలుగ	117
పిల్లిపెసర	85

గుత్తి-పెండేకల్లు డబ్లింగ్‌కు గ్రీన్‌సిగ్నల్

- రూ.351.8 కోట్లతో పనులు
- డీఆర్ఎం వెంకటరమణారెడ్డి

గుంతకల్లు: గుత్తి-పెండేకల్లు రైలు మార్గం డబ్లింగ్‌కు రైల్వే మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు లభించినట్లు డీఆర్ఎం కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుత్తి-పెండేకల్లు రైలు మార్గం దక్షిణ ప్రాంతాల మధ్య (బెంగుళూరు-హైదరాబాద్) కీలకం కావడంతో 29.2 కి.మీల డబ్లింగ్ పనులు చేపట్టేందుకు రూ.351.8 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేశారన్నారు. ప్రాజెక్టు పూర్తైతే గుంతకల్లు- పెండేకల్లు, గుత్తి-పెండేకల్లు మధ్య రైళ్ల రాకపోకలు సజావుగా సాగుతాయన్నారు. మరిన్ని రైళ్లు ప్రవేశపెట్టడానికి అవకాశముందన్నారు. డివిజన్‌లో అభివృద్ధి పనుల దృష్ట్యా పలు ప్యాసింజర్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని, ఏప్రిల్ 1 నాటికి చాలా వరకు పనులు చేసి సకాలంలో నడిచేలా చూస్తామన్నారు.

ధర్మవరం ఎల్‌సీ గేట్ తొలగింపునకు ప్రతిపాదన

గుంతకల్లు-కల్లూరు మార్గంలో పట్టణంలోని ధర్మవరం లెవల్ క్రాసింగ్ గేట్ తొలగించి ఆర్‌యూబీ (రైల్ అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి నివేదికలు తయారు చేసి జోనల్ అధికారులకు పంపినట్లు డీఆర్ఎం తెలిపారు. మల్లప్పగేట్-గుంతకల్లు స్టేషన్ ఔటర్‌కు జరుగుతున్న బైపాస్ లైన్ పనులు జూలైకు పూర్తవచ్చన్నారు. గుంతకల్లు జంక్షన్‌లోని 1,2 ప్లాట్‌ఫాంలను ఇతర ప్లాట్‌ఫారంలకు అనుసంధానించే పనులను వచ్చే ఏడాది ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లు జంక్షన్ ముగింట ఉన్న కోచ్ రెస్టారెంట్‌కు వచ్చే వారంలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంయూ సుధాకర్, సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, పీఆర్ఓ మురళీ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్ తదితరులున్నారు.

ఉచిత విద్య దరఖాస్తు గడువు పొడిగింపు

రాప్తాడురూరల్: విద్యాహక్కు చట్టం-2009 మేరకు 2023-24 విద్యాసంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య ప్రవేశానికి దరఖాస్తుకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. సాయిరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం - 2009,ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 4 వరకు సంబంధిత పోర్టల్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13 నుంచి 17 వరకు గ్రామ వార్డు సచివాలయాల్లో సమాచార ప్రాతిపదికన విద్యార్థి అర్హతపై నిర్ణయం తీసుకుంటారన్నారు. ఏప్రిల్ 18న మొదటి రౌండ్ లాటరీ ఫలితాలు, 19 నుంచి 25 వరకు పాఠశాలల యాజమాన్యాల నిర్ధారణ, 29న రెండో రౌండ్ లాటరీ ఫలితాల విడుదల చేయనున్నారు. మే 1 నుంచి 5 వరకు పాఠశాలల యాజమాన్యాలు నిర్ధారణ చేస్తాయి.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

- పరారీలో మరొకరు
- డబ్బు కోసమే దారుణం

ఆత్మకూరు: డబ్బు కోసం వ్యక్తిని హతమార్చేందుకు ప్రయత్నించిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఆత్మకూరు ఎస్‌ఐ రంగడు యాదవ్ గురువారం వెల్లడించారు. మండలంలోని పి.యాలేరు గ్రామానికి చెందిన గొల్ల తిమ్మరాజు ఈ నెల 15న తన పొలంలో వేరుశనగ పంటకు కాపలాకు వెళ్లాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన బోయ గణేష్, మరో ఐదుగురు అక్కడకు చేరుకుని తిమ్మరాజుపై హత్యాయత్నం చేశారు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... గురువారం ఉదయం ఆత్మకూరు ధాబా వద్ద ఉన్న గణేష్‌తో పాటు కూడేరు మండలం ఎం.ఎం.హళ్లి నివాసి అక్కులన్న, నారాయణపురం నివాసి వెంకట్రాముడు, అనంతపురంలోని తపోవనానికి చెందిన చాకలి మధుసూదన్, కృష్ణంరెడ్డిపల్లి నివాసి వడ్డే చిరంజీవిని అదుపులోకి తీసుకుని బొలెరో వాహనం, దాడికి ఉపయోగించిన కట్టెలు, రాళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేవలం డబ్బు కోసమే తిమ్మరాజుపై హత్యాయత్నం చేసినట్లు నిందితులు అంగీకరించడంతో వారిని అరెస్ట్ చూపి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఉన్న మరో నిందితుడు కురుగుంట నివాసి శేఖర్ పరారీలో ఉన్నాడు.

వైభవంగా అక్కమాంబ జాతర


పానకం కలశాలతో తరలివస్తున్న భక్తులు


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అక్క మహాదేవతల మూలవిరాట్

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- పానకం కలశాలతో ఊరేగింపు

కళ్యాణదుర్గం: ఏటా ఉగాది పండుగ మరుసటి రోజు ఆనవాయితీగా నిర్వహిస్తున్న కళ్యాణదుర్గం అక్కమాంబ జాతర మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం అక్క మహాదేవతలకు అభిషేకాలు నిర్వహించి, విశేష పూలతో సుందరంగా అలంకరించారు. వెండి ముకుటాలను ఏర్పాటు చేశారు. స్థానికులే కాక ఇతర ప్రాంతాలు, పొరుగున ఉన్న కర్ణాటక నుంచి దాదాపు 40 వేల మందికిపైగా భక్తులు పానకాల కలశాలతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. దొడగట్ట, గోళ్ల, బోరంపల్లి, ముదిగల్లు, గరుడాపురం, ఉప్పొంక, ఒంటిమిద్దే, తదితర గ్రామాల నుంచి కాలినడకన భక్తులు తరలివచ్చారు. కాలినడకన వస్తున్న భక్తుల సౌకర్యార్థం మార్గం మధ్యలో పలు చోట్ల దాతలు మంచినీరు, పానకం, చల్లని మజ్జిగను అందజేశారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు దారి పొడవునా ప్రత్యేక చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. అక్కమాంబ కొండ ఎక్కేందుకు చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ పోటీ పడ్డారు. కొండపై ఉన్న కొలనులో భక్తులు స్నానమాచరించి, గంగ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం జరిగింది.


అన్నదానం శిబిరం వద్ద భక్తుల సందడి

ప్రతి మహిళకూ చేకూరిన లబ్ధి


మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి మహిళకూ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం అసెంబ్లీలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల జీతాలు పెంచి ఇస్తున్నామన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో గర్భిణులు, బాలింతలు, శిశువులు, కిషోర బాలికలకు నాణ్యమైన పౌష్టికాహారం అందుతోందన్నారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీలో అంగన్‌వాడీలకు జీతభత్యాలు, సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత ఐసీడీఎస్‌లో 12,188 పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు.

కోటకొండలో ముగిసిన తిరునాల


తిరునాలకు బండ్లపై తరలివస్తున్న భక్తులు

పెద్దవడుగూరు: మండలంలోని గోపురాజుపల్లి సమీపంలో వెలసిన కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఉగాదిని పురస్కరించుకుని బుధవారం తిరునాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గురువారం ఉదయం ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. మొళకతాళ్ల, గోపురాజుపల్లి, చిత్రచేడు, చిట్టూరు, రాంపురం తదితర గ్రామాల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి.

జిల్లా జైలుకు 'శ్రీధరన్' ముఠా సభ్యులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: హవాలా డబ్బు దోపిడీ సాగించే కేరళ నివాసి శ్రీధరన్ ముఠా సభ్యుల పోలీస్ కస్టడీ ముగిసింది. దీంతో న్యాయమూర్తి ఆదేశాలతో జిల్లా జైలుకు గురువారం నిందితులను తరలించారు. రాప్తాడు సమీపంలోని హంపాపురం జాతీయ రహదారిపై ఇటీవల హవాలా డబ్బును దోపిడీ చేసిన కేసులో ఇప్పటికే పట్టుబడిన నలుగురిని పోలీసులు జ్యుడీషియల్ కస్టడీకి తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నాలుగు రోజుల క్రితం నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకుని, వివిధ ప్రాంతాల్లో వారు దోపిడీకి పాల్పడిన తీరును పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రాంతాల్లో ముఠా కార్యకలాపాలు కొనసాగించిన ప్రాంతాల్లో పోలీసు దర్యాప్తు బృందం పర్యటించి, కీలక సమాచారాన్ని రాబట్టింది. ఈ దోపిడీలో మొత్తం 14 మంది పాల్గొన్నట్లు గుర్తించి, పరారీలో ఉన్న వారి కోసం గాలింపు వేగవంతం చేశారు. కాగా, కేరళలోని ఏడు జిల్లాలో నిందితుల కోసం గాలించిన అనంత పోలీసులకు ఆ రాష్ట్ర పోలీసుల నుంచి ఆశించిన సహకారం లభించలేదని తెలుస్తోంది. దీనికి తోడు హవాలా డబ్బు దోపిడీ సాగించే ప్రధాన రెండు ముఠాల మధ్య అంతర్గత పోరు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఈ కేసులో కీలక నిందితులను కప్పాయాక్ట్ (ఏపీలో పీడీ) కింద కేరళ పోలీసులు రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. ఈ కేసును సవాలుగా తీసుకున్న జిల్లా పోలీసులు శ్రీధరన్ ఆట కట్టించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

జెడ్పీలో ప్రక్షాళనకు సిద్ధం

- పని తీరు ప్రమాణికంగా ఉద్యోగులపై చర్యలు
- 20 నుంచి 25 మందికి స్థాన చలనం



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల అక్రమాలను ప్రక్షాళన చేసే దిశగా చర్యలు వేగవంతమయ్యాయి. వివాదాలకు కేంద్రీకృతమవుతున్న దాదాపు 20 నుంచి 25 మంది ఉద్యోగుల సీట్లు మారనున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొంతకాలంగా కొందరు ఉద్యోగులు పని తీరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అంతర్గత విషయాలను బయటి వ్యక్తులకు చేరవేయడం, గ్రూపు రాజకీయాలు ప్రోత్సహించడం, పని వేళల్లో ఇష్టారాజ్యంగా బయటే ఉండడం, ఒకరిపై మరొకరు పెత్తనం సాగించడం తదితర కారణాలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇటీవల ఇద్దరు ఉద్యోగులు 'నువ్వెంతంటే నువ్వెంతంటూ' పరస్పరం దూషించుకోవడం దుమారం రేపుతోంది. ఈ అంశాన్ని చైర్‌పర్సన్ గిరిజమ్మ తీవ్రంగా పరిగణిస్తూ ఇద్దరినీ మందలించారు. వీరి ప్రవర్తనతో ప్రభావితమైన మరికొందరు విధుల నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అంశాలన్నింటినీ జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వివిధ రకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తొలుత సెక్షన్లు మార్చాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఓ నివేదిక సైతం సిద్ధమైనట్లు సమాచారం. మరో రెండు రోజుల్లో చైర్‌పర్సన్ అనుమతితో ఉద్యోగులకు సెక్షన్ల మార్పు చేయనున్నారు. ఈ అంశం ప్రస్తుతం జెడ్పీలో హాట్ టాపిక్‌గా మారింది.

'కేంద్రీయ' అడ్మిషన్లకు నోటిఫికేషన్

అనంతపురం: కేంద్రీయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మార్చి 27 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 17 దరఖాస్తుకు తుది గడువు. ఒకటో తరగతి అడ్మిషన్ పొందడానికి ఆరు సంవత్సరాలు నిండి ఉండాలి. వయస్సు నిర్ధారణకు మార్చి 31, 2023ను ప్రామాణికంగా తీసుకుంటారు. రెండో తరగతిలో అడ్మిషన్లకు ఏప్రిల్ 3 నుంచి 12లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ అడ్మిషన్లకు అప్పటికే ఖాళీ అయిన సీట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుని భర్తీ చేస్తారు. ఇది వరకు సిఫార్సు సీట్లు అందుబాటులో ఉండగా, తాజాగా వాటిని రద్దు చేశారు.

కారు బోల్తా- ఒకరి మృతి

కనగానపల్లి: కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన అక్తర్ హుస్సేన్ (68), తన కుమార్తె మెహతాజ్‌బేగం, అల్లుడు అబ్దుల్ ముజబర్‌తో కలసి గురువారం మధ్యాహ్నం బెంగుళూరు నుంచి అనంతపురానికి కారులో బయలుదేరాడు. సాయంత్రం కనగానపల్లి మండలం దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా కారు ముందు చక్రం టైర్ బరెస్ట్ కావడంతో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో అక్తర్ హుస్సేన్ మృతి చెందాడు. ఘటనపై కనగానపల్లి ఎస్‌ఐ హనుమంత రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

54 మంది డిపాజిట్ గల్లంతు

- పట్టభద్రుల ఎమ్మెల్సీలో 46 మంది..
- ఉపాధ్యాయ ఎన్నికలో 8 మంది 1/6 వంతు ఓట్లకు దూరం


పట్టభద్రుల ఓట్ల లెక్కింపు దృశ్యం (ఫైల్)

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ స్థానాలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో 61 మంది పోటీ చేస్తే 54 మంది డిపాజిట్ కోల్పోయారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి ముగ్గురు అభ్యర్థులు డిపాజిట్ దక్కించుకోగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నలుగురు అభ్యర్థులు డిపాజిట్ దక్కించుకున్నారు.

1/6 వంతు ఓట్లు రావాలి..

ఎన్నికల్లో పోలైన ఓట్లలో చెల్లుబాటైన వాటిల్లో 1/6 వంతు ఓట్లు సాధిస్తేనే డిపాజిట్ దక్కుతుంది. పట్టభద్రుల ఓట్లు 3,30,124 ఓట్లు ఉండగా 2,45,687 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 2,26,448 చెల్లుబాటయ్యాయి. 19,239 ఓట్లు చెల్లలేదు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి డిపాజిట్ దక్కాలంటే చెల్లుబాటైన 2,26,448 ఓట్లలో 1/6 వంతు అంటే 13,560 ఓట్లు సాధించాలి. ఈ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పోలైన 2,26,448 ఓట్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి 95,969 ఓట్లు, టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి 94,149 ఓట్లు, పీడీఎఫ్ మద్దతు అభ్యర్థి పోతుల నాగరాజు 18,758 ఓట్లు సాధించి డిపాజిట్ దక్కించుకున్నారు. బీజేపీ అభ్యర్థి, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థులతో పాటు మిగిలిన 44 మంది స్వతంత్ర అభ్యర్థులకూ డిపాజిట్ దక్కలేదు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇలా...

ఉపాధ్యాయుల ఓట్లు 28,148 ఉండగా 25,889 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 25,271 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. 608 ఓట్లు చెల్లలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థికి డిపాజిట్ దక్కాలంటే చెల్లుబాటైన 25,271 ఓట్లలో 1/6 వంతు అంటే 1,510 ఓట్లు సాధించాలి. ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పోలైన 25,271 ఓట్లలో వైఎస్సార్ సీపీ మద్దతు ఇచ్చిన ఎంవీ రామచంద్రారెడ్డి 8,846 ఓట్లు, పీడీఎఫ్ మద్దతుతో పోటీ చేసిన కత్తినరసింహారెడ్డి 4,162 ఓట్లు, ఒంటేరు శ్రీనివాసరెడ్డికి 6,853 ఓట్లు, అనిల్ వెంకట ప్రసాద్‌రెడ్డి 3,212 ఓట్లు సాధించి డిపాజిట్ దక్కించుకున్నారు. మిగిలిన ఎనిమిది అభ్యర్థులు డిపాజిట్ దక్కించుకునే స్థాయిలో ఓట్లు సాధించలేదు.

'పది' పరీక్షలపై ప్రత్యేక దృష్టి

- ప్రైవేట్ సెంటర్లలోనూ ప్రభుత్వ సిబ్బందే
- జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరాం


మాట్లాడుతున్న డీఈఓ సాయిరాం

రాప్తాడు రూరల్: మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణపై ముందస్తు చర్యలు వేగవంతం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరాం తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 35,305 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. 139 కేంద్రాల్లో ప్రతిష్టాత్మకంగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఏ ఒక్క కేంద్రంలోనూ విద్యార్థులకు చిన్న ఆటంకం కూడా ఎదురు కాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఫర్నీచరు తక్కువ ఉండే కేంద్రాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. ఏ ఒక్క విద్యార్థీ నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదనేది తమ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి కేంద్రంలోనూ నీటి వసతి కలిగిన మరుగుదొడ్లు, కరెంటు, తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 60 ప్రైవేట్ పాఠశాలలను పరీక్ష కేంద్రాలకు ఎంపిక చేశామన్నారు. పరీక్ష జరిగే రోజు ఈ కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది తప్ప ఆయా పాఠశాలల ఉద్యోగులు, సిబ్బంది ఉండకూడదని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లోని సీసీ కెమెరాలన్నీ జిల్లా విద్యాశాఖ ఆధీనంలోకి తీసుకుంటుందని స్పష్టం చేశారు.

రైలు ఢీకొని బాల కార్మికుడి దుర్మరణం

అనంతపురం సిటీ: రైలు ఢీకొన్న ఘటనలో ఓ బాల కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని సంజహవల్ ప్రేమ్‌నగర్‌కు చెందిన జకీర్ అలీ (13) అక్కడి కార్మికులతో కలసి అనంతపురానికి వలస వచ్చి పీఓపీ పనుల్లో పాలుపంచుకుంటున్నాడు. అనంతపురంలోని లక్ష్మీనగర్‌లో అద్దె గదిలో నివాసముంటున్న జకీర్ అలీ గురువారం ఉదయం 9 గంటలకు రహమత్ నగర్‌కు బయలుదేరాడు. చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ పట్టాలు దాటుతుండగా ధర్మవరం – మచిలీపట్నం వెళ్లే రైలు ఢీకొంది. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి జేబులోని ఆధార్ కార్డు ఆధారంగా ఉత్తర ప్రదేశ్‌లో ఉంటున్న కుటుంబసభ్యులకు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా సుంకులమ్మ రథోత్సవం

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడులో సుంకులమ్మ రథోత్సవాన్ని గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. .మద్యాహ్నం మడుగు తేరు, సాయంత్రం ప్రధాన రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.


అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు


రథోత్సవానికి తరలి వస్తున్న భక్తులు

కమనీయం.. శ్రీవారి కల్యాణం

యాడికి: మండలంలోని కమలపాడులో వెలసిన కొత్త లక్ష్మీవేంకటరమణ స్వామి కల్యాణోత్సవాన్ని గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు, అర్చనలు, అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. ప్రొద్దుటూరుకు చెందిన రవ్వ వినీతకుమారి, స్వప్నేష్ దంపతులు, చెన్నేకొత్తపల్లి మండలం చిన్నపల్లె గ్రామానికి చెందిన ఆలమూరు మాధవి కోనారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు. పెన్నా సిమెంట్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం, ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

నేడు, రేపు జాతీయ సెమినార్

రాప్తాడురూరల్: ఆజాదీకా అమృత్ మహోత్స వాల్లో భాగంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల వాణిజ్య - నిర్వహణ విభాగం అధ్వర్యంలో 'భారతదేశంలో డిజిటల్, విధ్వంసక సాంకేతిక తలు-పోకడలు, సవాళ్లు, అవకాశాలు' అనే అంశాలపై శుక్ర, శనివారం రెండు రోజుల పాటు జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు. ఇండియన్ కౌన్సిల్ అఫ్ సోషల్ సైన్సు రీసెర్చ్ వారి సౌజన్యంతో ఈ సెమినార్ జరుగుతుం దని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధ కులు, విద్యార్థులతో సహా వివిధ రంగాల మేధావులు పాల్గొంటారన్నారు.

లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో సరస్వతీపూజ



కరస్పాండెంట్, ఉపాధ్యాయులతో పదోతరగతి విద్యార్థులు

రాప్తాడురూరల్: స్థానిక ఆదిమూర్తినగర్‌లోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్ పదో తరగతి విద్యార్థులు గురువారం సరస్వతీ పూజ నిర్వహించారు. సరస్వతీ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిం చారు.విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవాలన్నారు. సమాజం పట్ల స్నేహ, సేవా భావం కలిగి ఉండాలన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికా వద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ప్రభావతి ఉపాధ్యాయులు రవీంద్ర గౌడ్, పూజారి ఈరన్న, హాజీబాషా, భాస్కర్ బాబు, నూర్ బాషా, హాసీన బేగం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సాయిట్రస్టు చేయూత

అనంతపురం కల్చరల్: మెడికల్ విద్యార్థి జగపతి భరద్వాజ్‌కు సాయిట్రస్టు ఆధ్వర్యంలో చేయూతనందించారు. దాతలు సాయి దీక్షిత బుక్ పాయింట్, రవిచంద్ర సహకారంతో సాయిట్రస్టు ఆధ్వర్యంలో రూ.25 వేలు విలువ చేసే దంత వైద్య పరికరాలు అందించారు. కోర్సు పూర్తయ్యే వరకు ఆర్థికంగా సాయం అందిస్తామని ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌సాయి తెలిపారు.

కమనీయం సీతారామ కల్యాణం



కల్యాణోత్సవంలో సీతారాములు

అనంతపురం కల్చరల్: శ్రీరామనవమి ఉత్స వాలు వారం రోజుల ముందుగానే ఆరంభమ య్యాయి. స్థానిక సోమనాథనగర్‌లోని కోదం డరామాలయంలో గురువారం రాత్రి మణూరు నాగరాజు, ఉమాదేవి దంపతులు పరిణయ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు సాగే శ్రీరామ నామ సప్తాహాన్ని ప్రముఖ సంస్కృత పం డితులు నాగత్రిశూలపాణి ప్రారంభించి, శ్రీరామ నవమి విశిష్టతను తెలియజేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీహరిహర ఆలయం లో శ్రీరామనామ సప్తాహం ఘనంగా ప్రారంభ మైంది. సాయిట్రస్టు ఆధ్వర్యంలో భజన మం డలి సభ్యులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

వేసవిని దృష్టిలో ఉంచుకొని నీరందించండి



సమావేశంలో పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్లు

అనంతపురం క్రైం: వేసవిని దృష్టిలో ఉంచుకొని అదనంగా మరోగంటపాటు నీరు సరఫరా చేయాలని ఇంజినీర్లను మేయర్ వసీం ఆదేశిం చారు. గురువారం నగరపాలక సంస్థలో ఇంజినీ రింగ్ విభాగం అధికారులతో మేయర్ సమీక్ష నిర్వహించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుం డా చర్యలు తీసుకోవాలన్నారు. రంజాన్, శ్రీరా మనవమిని పండుగలు రానున్న తరుణంలో మసీదులు, రామాలయాల వద్ద పారిశుధ్యం మెరుగుతో పాటు నీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మేయర్ 39వ డివిజన్‌లో పర్యటించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఈఈలు రామమోహన్ రెడ్డి, చంద్రశేఖర్, కార్పొరేటర్లు బాలాంజనేయులు, సైఫుల్లాబేగ్, ఇస్హాక్ పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శాశ్వత హుండీ కానుకలను ఈనెల 25న ఉదయం 11 గంట లకు లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించాల న్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

- నెలవంకను చూసేందుకు ముస్లింల నిరీక్షణ
- ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు





నెలవంక కనిపించడంతో దువా చేస్తున్న దృశ్యం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నెలవంక గురువారం కనిపించింది. నెలవంకను చూసి రంజాన్ మాస ఉపవాసాలు ప్రారంభిస్తారు. షవ్వాల్ మాసంలో నెలవంకను చూసి ఉపవాసాలను విరమిస్తారు. నగ రంలోని పలు మసీదుల్లో నెలవంకను చూసేందుకు పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చారు. నెలవంకను చూసిన అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొ ని, రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నగరంలోని నూరాని మసీదులో రంజాన్ మాసం నెలవంకను నగర మేయర్ దర్శించుకున్నారు. ఆయన జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్‌తో కలిసి నెలవంకను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక దువాను ఆచరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, బాబాఫక్రుద్దీన్, ఇసాక్, జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరి ఖాజా, కోఆప్షన్ మెంబర్ షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాదు, దాదాఖలందర్, కువైట్ ఖాదర్ బాషా, ఖాజా, షెక్షావలి, అల్‌మేవా షెక్షావలి తదిత రులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో సెహరీకి ఏర్పాట్లు:
నగరంలోని పలు మసీదుల్లో ప్రత్యేకంగా ఉపావా సాలు ఉండే వారి కోసం సెహరీ ఏర్పాట్లను సవ్‌జ వాన్ కమిటీ, మసీదు కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నగరంలోని రహమత్ నగర్ నాల్గో క్రాస్‌లో ఉన్న గౌసియా మసీదులో, పాతూరులో ఉన్న మాసుమా బీబీ దర్గా వద్ద, సాయినగర్‌లోని రెహమానియా మసీదు, గుల్జార్‌పేటలోని ఆయేషా మసీద్‌లో, అరవింద్‌నగర్‌లోని మామూర్ మసీ దులో ఏర్పాటు చేశారు. వీటిని ముస్లింలు, విద్యా ర్థులు, ప్రయాణికులు, సెహరీ కోసం ఇబ్బందులు పడే వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మసీదుల వద్ద సదుపాయాలు కల్పించండి
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీ దుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని ముస్లిం మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నగర మేయర్ వసీంను కలిసి వినతిపత్రం అందించారు. మేయర్ నివాసంలో ఆయన్ను కలిసి మాట్లాడారు. శుక్రవారం నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ ఎం ప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ఫరూక్, షెక్షావలి, జీలాన్, దౌల, మహబూబ్‌బాషా తదిత రులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలసిన పామిడి వీరాంజనేయులు



సీఎం జగన్‌ను కలిసిన ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు

అనంతపురం క్రైం: అమరావతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు గురు వారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా ముఖ్యమంత్రికి ఆయన వినతిపత్రం సమర్పించారు.

శోభకృత్ క్యాలెండర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: ఇందూ ధర్మ ప్రధాత, త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వ రుల జీవిత విశేషాలను, ఆలోచనలను తెలిపే క్యాలెండర్లను డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య గురువారం ఆవిష్కరించారు. ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు మాట్లాడుతూ భగవద్గీతకు సరికొత్త నిర్వ చనాలిచ్చి సకల సమస్యల పరిష్కరమార్గమైన గీతా సారాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు.

నేడు యూత్ పార్లమెంట్

అనంతపురం కల్చరల్: నెహ్రూ యువకేంద్ర ఆధ్వ ర్యంలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్‌ను శుక్ర వారం నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే అధికారి శ్రీనివా సులు తెలిపారు. స్థానిక ఆర్ట్స్‌కళాశాల డ్రామా హాలులో జరగనున్న కార్యక్రమంలో టెక్నాలజీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథ కాలు, ఉపయోగాలు, రాజకీయాల్లో యువత పాత్ర, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, యూత్‌స్కిల్స్, లేబర్ వెల్ఫేర్, బేటీ బాచావో బేటీ పడావో అనే అం శాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ ఆంజనేయులు

రాప్తాడు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్‌ఐ పీవై ఆంజనేయులు తెలిపారు. గురువారం హంపా పురం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై హం పాపురానికి చెందిన యువత హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

రాతిదూలం లాగుడు పోటీలు

యాడికి: ఉగాది పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సహకారంతో మండలం లోని రాయలచెరువులో గురువారం లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను జెడ్పీ మాజీ సభ్యుడు వెంకట రామి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తలారి నాగేష్ ప్రారంభించారు. ప్రథమ స్థానంలో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లె గ్రామానికి చెందిన నాగయ్య వృషభాలు, రెండో బహుమతి నంద్యాల జిల్లా పీఆర్ పల్లె గ్రామానికి చెందిన శ్రీరాములు వృ షభాలు, మూడో బహుమతి గుంతకల్లు మండలం నాగసముంద్రం జయరామిరెడ్డికి చెందిన వృషభాలు, నాలుగో బహుమతి నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన మహేష్‌కు చెందిన వృషభాలు, ఐదో బహుమతి యాడికి మండలం కుందన కోటకు చెం దిన చెన్నప్ప వృషభాలు, ఆరో బహుమతి గార్లదిన్నె మండలం కృష్ణాపురం నాగేశ్వరరెడ్డి వృషభాలు గెలుపొందాయి.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



కనగానపల్లిలో భూసర్వే నిర్వహిస్తున్న అధికారులు

కనగానపల్లి: సుమారు వందేళ్ల తర్వాత ప్రభుత్వం చేపట్టిన సమగ్రసర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ పీవీ రమణ తెలిపారు. గురువారం మండల కేం ద్రంలో భూ సర్వే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలోని కనగానపల్లి, రాంపురం, కోనాపురం గ్రామాల్లో రెవెన్యూ, సర్వే సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి, సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలి పారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మారుతీప్రసాద్, సర్వే సిబ్బంది, స్థానిక వైఎస్సా ర్‌సీపీ నాయకులు పాపన్న, అంకే రామకృష్ణ, చిం తమేకల రవి, అక్కులప్ప, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడు: మండలంలో ఖాళీగా ఉన్న రెండు ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరత్న గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండల కేంద్రం రాప్తాడు-1 అంగన్‌వాడీ కేంద్రం, గంగలకుంట అంగన్‌వాడీ కేం ద్రంలో ఆయా పోస్టు ఖాళీగా ఉందన్నారు. రాప్తాడు ఆయా పోస్ట్ బీసీ-బీ, గంగలకుంట ఆయా పోస్ట్ ఓపెన్ కేటగిరీకి కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 29న సాయంత్రం 5 గంటలలోపు సీడీపీఓ కార్యాల యంలో దరఖాస్తులు అందించాలన్నారు. అభ్య ర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, ఈ ఏడాది జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉన్నవారు అర్హులన్నారు.

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని పీసీ కాలనీ, కురుగుంటలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కూడేరు సీడీపీఓ ధనలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29 సాయంత్రం 5 గంట లలోపు స్వయంగా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

రీ సర్వేను నిర్లక్ష్యం చేయొద్దు
అనంతపురం క్రైం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన రీసర్వేను నిర్లక్ష్యం చేయొద్దని కమిషనర్ రమణారెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సచి వాలయ సిబ్బందితో పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. స్థిరాస్తిదారులకు ఫాం 1 అందజేసి సంతకాలు తీసుకోవాలన్నారు. త్వరలో ఓఆర్ఐ మ్యాప్స్ వస్తాయన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు
పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆదేశించారు. గురువారం నగరంలోని 29వ డివి జన్‌లో ఆయన పర్యటించారు. ఇంటింటా చెత్త సేక రణ, కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగిం చాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు సైతం స్వచ్ఛందంగా క్లాప్ ఆటోలకు చెత్త అందజేయాల న్నారు. రోడ్లపై చెత్త వేయకూడదన్నారు. కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో వనరులు పెంచుకోవాలి

- జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు



చెత్తను పరిశీలిస్తున్న డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ తదితరులు

రాప్తాడురూరల్: పంచాయతీల్లో స్థానిక వనరులు పెంచుకుని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు సూచించారు. గురువారం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో 'మోడల్ పంచాయతీ'పై అవగా హన సదస్సు ఏర్పాటు చేశారు. డీఎల్‌పీఓ సుమన జయంతి, ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్, ఈఓఆర్డీ ఆలి వేలమ్మ, ఆకుతోటపల్లి, ఉప్పరపల్లి, రాచానపల్లి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. డీపీఓ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్తను సేకరించాలని, దాన్ని సేంద్రియ ఎరువుగా మార్చి విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం పెరుగుతుందన్నారు.

3 వరకూ పౌష్టికాహార పక్షోత్సవాలు

బుక్కరాయసముద్రం: గర్భిణులకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో గాం ధీ నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టిక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిం చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఆకుకూరలు, గుడ్లు తప్పనిసరిగా తీసుకోవాల న్నారు. వీటి ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అంగ న్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు జరు గుతాయన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సరుకులను సక్రమంగా అందించాలన్నారు. అంగన్ వాడీ కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని సూచిం చారు. సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్ర మంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ, సూప ర్‌వైజర్ ధనలక్ష్మి, కౌసల్య, బీసీసీ రామాంజినే యులు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కొండమ్మ, వార్డు మెంబర్ గాంధీ నగర్ ప్రసాద్ పాల్గొన్నారు.

విప్లవవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి



భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్: విప్లవ వీరుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని యువత వారి బాటలో నడ వాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పోరాటం ప్రత్యేకమన్నారు. కార్యక్రమంలో సం ఘాల నాయకులు సంతోష్, కుళ్లాయిస్వామి, ఆనం ద్‌కుమార్, మోహన్‌కృష్ణ, శ్రీకాంత్, నిఖిల్, మైను, దాదు, మురళీ, పవన్, హరికృష్ణ, పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..
సీఐటీయూ ఒకటో నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభ గురువారం నిర్వహిం చారు. వారి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నగర క్యాదర్శి వెంకటనారాయణ మాట్లాడారు. సీపీఎం నాయకులు రామిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, భగత్ సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీని వాసులు, నాగరాజు, నాయకులు సోమప్ప, నాగ రాజు, విశ్వ, ముత్తుజ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు



వక్తృత్వపు పోటీల్లో విజేతలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రపంచ టీబీ దినో త్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు గురువారం వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, సామాజిక వైద్య విభాగం, టీబీ అండ్ చెస్ట్ విభాగం, జిల్లా క్షయ నిర్మూలన శాఖ, ఎన్ఎ స్ఎస్ యూనిట్-2 సంయుక్త ఆధ్వర్యంలో టీబీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం, మెడికో లకు వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని తృతీయ సంవత్సరం విద్యార్థులు 2కే 20 బ్యాచ్‌కు చెందిన జుబిల్, షాజీ, మాలగుం డ్ల స్వాతి, ద్వితీయ బహుమతిని తనూజ గెలు పొందారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, సామాజిక వైద్య శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్లు అరుణ, సుమన గోపిచంద్, సుష్మ, శ్రీనివాసరావు, గీతాంజలి పాల్గొన్నారు.

గొర్రెలు మేకల ఫెడరేషన్ చైర్మన్‌కు సన్మానం



గొర్రెల, మేకల ఫెడరేషన్ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్‌ను సన్మానిస్తున్న పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాల యంలో ఉమ్మడి అనంతపురంజిల్లా గొర్రెలు, మేకల ఫెడరేషన్ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, సభ్యులు ఈశ్వరయ్య, కృష్ణప్పను పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి సన్మానిం చారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను అధిష్టానం తప్పక గుర్తిస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నరసిం హగౌడ్‌కు చైర్మన్ పదవి కేటాయించడం హర్షించ దగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అనుబంధ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్ చార్జ్ రిలాక్స్ నాగరాజు, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, నాయకులు మల్లెమీద నరసింహులు, మారుతీనాయుడు, వెంకటేష్, తలారి నవీన్, రాజు నాయక్, మిద్దె నగేష్, నిమ్మల నాగరాజు, ఎస్‌వీ రమణ, కురుబ చంద్ర, ఖాదర్‌బాషా, రంగారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని పూణేలో ఈ నెల 24 నుంచి 28 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు జిల్లా నుంచి పుష్పావతి, అమీన, ప్రతాప్ ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా చీఫ్ కోచ్ వెంకటర మణ ప్రత్యేకంగా అభినందించారు.

'గేట్' పరీక్షలో జాతీయ స్థాయి ర్యాంకులు

బుక్కరాయసముద్రం: మండల పరి ధిలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ (అటానమస్) కళాశాల విద్యార్థులు గేట్-2023 పరీక్షలలో అత్యంత ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఫిబ్రవరి నెలలో గేట్-2023 ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారన్నారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించార న్నారు. వీటిలో మహమ్మద్ ముదా శీర్ (మెకానికల్) జాతీయ స్థాయిలో 3245, షేక్ మహమ్మద్ సుహేల్ (మెకానికల్) 208, భరత్‌కుమార్ (ఈసీఈ) 2049, శివ రామిరెడ్డి (ఈసీఈ) 1564, రవి తేజ్‌రెడ్డి (సీఎస్ఈ) 10445, ఇంద్రసేనారెడ్డి (సీఎస్ఈ) 1308 ర్యాంకులు సాధిం చారని తెలిపారు.

ఉన్న ఊర్లోనే ఉపాధి

- కూలీల వలసలకు కళ్లెం
- రాప్తాడు మండలంలో 5.20 లక్షల పని దినాల కల్పన లక్ష్యం



హంపాపురం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాప్తాడు: ఉపాధి హామీ పథకం...కూలీల వలసలు నివారించి ఉన్న ఊరిలోనే జీవనో పాధి కల్పించే బృహత్తర కార్యక్రమం. కూలీ లకు వరంగా ఉన్న ఈ పథకాన్ని సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోంది. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడంతో పాటు వేతనాలను ఎప్పటికప్పుడు కూలీల ఖాతాలకు జమ చేస్తోంది. సొంతూరులోనే పని దొరుకుతుండడంతో కూలీలు సంతోషం గా జీవనం సాగిస్తున్నారు.

జోరందుకున్న ఉపాధి పనులు
మండలంలో ఉపాధి హామీ పథకం పనులు జోరందుకున్నాయి. వ్యవసాయ పనుల జోరు తగ్గి వేసవి ఆరంభం కావడంతో కూలీలు ఉపాధి పనుల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో 2023-24 సంవత్సరానికి సం బంధించి మండలంలో 5 లక్షల 20 వేల పని దినాలను కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలంలో 10,688 జాబ్ కార్డులు ఉండగా ఇందులో మొత్తం 15771 మంది పనుల్లో పాల్గొంటున్నారు. 2023-24 సంవత్సరంలో వీరందరికి పని కల్పించడం ద్వారా రూ.10 కోట్లు వెచ్చించడానికి అధికా రులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా నీటి వనరులు, వాగులు, చెరు వుల ఆధునీకీకరణ, పంట పొలాల చుట్టూ సరిహద్దులు, అంతర్గతంగా కందకాలు, ఇం కుడు గుంతలు వంటి తవ్వకం పనులు చేప డతారు. జగనన్న పచ్చతోరణం పథకంలో భాగంగా రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశా లు, చెరువు గట్లపైన మొక్కలు నాటే పనులు చేప డుతున్నారు. రైతుల పొలాల్లో ఉద్యాన, పండ్ల తోటల సాగును ప్రోత్సహించడానికి పనులు కేటాయిస్తారు. వంద రోజులు పని కల్పించి రోజుకు రూ.250 చొప్పున కూలీ సొమ్ము లభించేలా ప్రణాళికలు రూపొందించారు.

అడిగిన వారందరికీ ఉపాధి



ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల వలస లను నివారించా లన్న ఉద్దేశంతో ఇప్పటికే అన్ని గ్రామాల్లో పనులను గుర్తించాం. గ్రామాల్లో అడిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం. ఏడాదికి కనీసం 100 రోజుల పని ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. పని చేసే చోట కూడా కొన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పాం. మండలంలో ఉన్న కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి. పనుల్లో పారదర్శకత కోసం ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– సాల్మన్, ఎంపీడీఓ, రాప్తాడు

- మండలంలో జాబ్ కార్డులు:10,688
- పనుల్లో పాల్గొంటున్న కూలీలు : 15,771
- వెచ్చించనున్న నిధులు: రూ.10 కోట్లు